"మనసే స్వామి. నా సుఖ దఃఖాలకి మూల కారణం నా మనసే." వినయంగా చెప్పిందామె.

"ఆ మనసుని తీసేస్తే అప్పుడు ఆనందాన్ని కాని, దుఃఖాన్ని కాని అనుభవించగలమా?"

"లేదు స్వామి. అప్పుడా అవకాశం వుండదు."

"నేనా మనసుని తీసేసాను. దాంతో ఆనందం, దుఃఖం లేని ప్రశాంత సమత్వ స్థితిలో వున్నాను. అందుకే నా మొహంలో ఎల్లవేళలా నువ్వు ప్రశాంతతని తప్ప ఆనందాన్ని కాని, దుఃఖాన్ని కాని చూడలేవు." వివరించాడు దిగంబర స్వామి.

"మనసుని తీసేయడం ఎలా స్వామి?"ఆశగా అడిగింది ఆమె.

"ఈ ప్రపంచంలో ఎవరికి వారు తెలుసుకునేదే తప్ప, ఇతరులు నేర్పితే రాని ఏకైక స్థితి అది. దైవభక్తి, నిష్కామ సేవలాంటివి ఆ స్థితికి తాళం చెవులు." జవాబిచ్చాడా దిగంబర స్వామి.

## 11. పనికిరాని డబ్బు

ఓ పిసినారి వ్యాపారి తన జీవిత కాలంలో ఏభై లక్షల దీనార్లని సంపాదించాడు. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం 'వచ్చే ఏడాది ఈ డబ్బుని ఖర్చు చేస్తాను' అనుకుంటూ కాలం గడపసాగాడు. అకస్మాత్తుగా ఓ రోజు మృత్యు దేవత అతని ముందు ప్రత్యక్షం అయి చెప్పింది.

"నీ ప్రాణాలు తీసుకెళ్ళడానికి వచ్చాను. నా వెంట రా."

"నాకు మూడు రోజులు గడువు ఇవ్వు. నా డబ్బుతో నేను చేయాల్సిన ముఖ్యమైన పనులు చాలా ఉన్నాయి." కోరాడా పిసినారి.

"కుదరదు. రా." ఆజ్ఞాపించింది మృత్యు దేవత.

"పోనీ ఒక్క రోజు గడువు ఇవ్వు. చాలు." బ్రతిమాలాడు.

"ఊహూ. రా."

అతని చొక్కా అంచుని పట్టుకుని లాగసాగింది మృత్యు దేవత.

"కనీసం ఓ గంటైనా గడువు ఇవ్వు. లేకపోతే ఇంతకాలం కష్టపడి సంపాదించినదంతా వృధా అవుతుంది." దీనంగా కోరాడా పిసినారి.

"ఊహూ. తక్షణం రావాల్సిందే."

మృత్యు దేవత తన పట్టుని వదల్లేదు.

"నా ఆస్తిలో సగ భాగం నీకిస్తాను. నాకు కనీసం అయిదు నిముషాలు ఇవ్వు చాలు."

"నీ ఆస్తి మొత్తం ఇచ్చినా సరే ఒక్క నిముషం కూడా గడువు ఇవ్వను. పద పోదాం."

ఆ పిసినారి వెంటనే కలం, కాగితం తీసుకుని గబ గబ ఇలా రాసాడు.

'మీలో ఎవరు ఈ ఉత్తరాన్ని చూసినా సరే. మీరు జీవించడానికి సరిపడే ధనం కన్నా ఎక్కువ ఉంటే, ఇంకా ఎక్కువ సంపాదించడానికి కాలాన్ని వృధా చేయకండి. సంపాదించిన దాంతో హాయిగా జీవించండి. నా ఏభై లక్షల దీనార్లు నా జీవితాన్ని పొడిగించే ఒకే ఒక్క నిముషాన్ని కొనడానికి కూడా పనికి రాలేదు. ఈ సంగతి అందరికీ చెప్పండి.'

తర్వాత అతను మృత్యు దేవత వెంట బయలుదేరాడు.

## 12. విధేయత

ఒకతను తనింట్లో నిద్రిస్తూంటే, అతని పడక గది నిండా అకస్మాత్తుగా వెలుగు నిండింది. దాంతో అతనికి మెలకువ వచ్చింది. అతను లేచి కూర్చోగానే, ఆ వెలుగునించి అతనికి ఆకాశవాణి వినిపించింది.

"ఈ గది బయట పెద్ద రాతి బండ ఉంది. నీ బలమంతా ఉపయోగించి దాన్ని తొయ్యి."

ఆ రోజు నించి ఆ యువకుడు రోజూ ఆ పని చేయసాగాడు. చాలాకాలం అతను ఉదయం నించి సాయంత్రం దాకా ఆ రాతిని తన విశాలమైన భుజాలతో తోయసాగాడు. అది కదలకపోవడంతో బలమంతా ఉపయోగించి తోయసాగాడు. ప్రతీ రాత్రి అతను తన పడకగదిలోకి పూర్తి అలసటతో వచ్చి, ఆ రోజంతా